క్లుప్తంగా

భక్తులకు అన్నదానం

ఓర్వకల్లు: నన్నూరు గ్రామ సమీపంలో సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. మండలంలోని ఉయ్యాలవాడ, లొద్దిపల్లె, పూడిచెర్ల, బైరాపురం తదితర గ్రామాల ప్రజల సహాయ సహకారాలతో నన్నూరు గ్రామ ప్రజలు కులమతాలకు అతీతంగా అన్నదానం చేపట్టారు. మల్లన్న దర్శనార్థం తిరుగు ప్రయాణంలో కన్నడిగులు మహానంది, యాగంటి, ఓంకారం క్షేత్రాలను దర్శించుకుంటారు. నన్నూరు మీదుగా వెళ్లే భక్తులకు గత పదేళ్లుగా ఇక్కడ అన్నదానం చేస్తున్నారు. సోమవారం కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు భక్తులకు అన్నం వడ్డించారు.

ముగిసిన ఉగాది ఉత్సవాలు



నల్లారెడ్డి స్వామిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఉగాది ఉత్సవాలు ముగిశాయి. మండల కేంద్రంలోని దాసరి వీధిలో శ్రీ చింతలముని రంగస్వామి, మాల వీధిలో శ్రీ నల్లారెడ్డిస్వాములు వారి ఆలయాల నుంచి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో తూర్పు, పడమటి ఆంజనేయ స్వాములు ఆలయాలకు, కొటారు మిట్టలోని శ్రీ రంగస్వామి ఆలయాల వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలను నిర్వహించారు. ముడుమాల, మారందొడ్డి, పోలకల్, బురాన్‌దొడ్డి, కొత్తకోట, కంబహాల్ తదితర గ్రామాల ముగింపు వేడుకలకు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

12 నుంచి రామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని రామాలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శతాబ్ది ఉత్సవాల సమితి అధ్యక్షుడు చిలుకూరి ప్రభాకర్, ప్రధాన అర్చకులు మాళిగి హనుమేషాచార్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉత్సవాల ఆహ్వాన పత్రికలను రాష్ట్ర మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్‌చే ఆవిష్కరింప చేసి ఆహ్వానించారు. సమితి కోశాధికారి చిలుకూరి నందకిషోర్, సభ్యులు వ్యాసరాజ్, ప్రాణేష్, నరసింహ, భాను ప్రకాష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌కు నిప్పు పెట్టిన ఆగంతకుడు

పాణ్యం: కొండజుటూరు గ్రామంలో ఓ ఆగంతకుడు ట్రాక్టర్‌పై పెట్రోల్ పోసి నిప్పుటించాడు. సోమవారం తెల్లవారు జామున గ్రామానికి చెందిన రామసుబ్బయ్య అనే రైతు తన ఇంటి ముందు నిలిపిన ట్రాక్టర్ ఇంజిన్‌పై గుర్తు తెలియనని దుండగుడు పెట్రోల్ పోసి నిప్పటించారు. మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు ఆర్పారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా ప్రభోత్సవం



ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: గూడూరు మండలంలోని జులకల్ గ్రామంలో సోమవారం ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ నీలకంఠేశ్వర రామలింగేశ్వర స్వాములవారికి వైభవంగా ప్రభోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఏడాది నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభల సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

బేతంచెర్ల: డోన్‌కు చెందిన వ్యక్తి ఆర్టీసీ బస్సులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్ఐ రమేష్ బాబు వివరాల మేరకు.. డోన్ కొండపేటకు చెందిన ఆవుల శ్రీధర్‌నాయుడు (52) స్టేట్ బ్యాంక్‌లో మెసెంజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఆరేళ్ల కుమారుడితో కలిసి బేతంచెర్ల మండలం ముద్దవరం గ్రామంలోని సుంకులమ్మ దర్శనం కోసం బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో బేతంచెర్లలోని డోన్ క్రాస్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ఎక్కాడు. డోన్ చేరుకోగానే శ్రీధర్ నాయుడు అపస్మారక స్థితిలో ఉండడంతో కుమారుడు కండెక్టర్ వద్దకు వెళ్లి తన తండ్రి లేవట్లేదని తెలిపాడు. కండెక్టర్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అతన్ని చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఈద్గాల వద్ద బందోబస్తు

కర్నూలు: రంజాన్ పండుగ నేపథ్యంలో శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ పర్యవేక్షణలో ప్రధాన ప్రార్థన మందిరాలు ఆనంద్ టాకీస్ వద్దనున్న పాత ఈద్గా, సంతోష్ నగర్ కొత్త ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రధాన రహదారులను మూసివేసి ట్రాఫిక్‌ను మళ్లించారు.



సి.బెళగల్‌లో ఖురాన్ సందేశాన్ని వినిపిస్తున్న ఢిల్లీకి చెందిన అఫిసాబ్ జక్రియా



గార్గేయపురం ఈద్గాలో దువా చేస్తున్న దృశ్యం



ఈ. తాండ్రపాడులో నల్ల రిబ్బన్లతో ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

అల్లాహు అక్బర్

ఘనంగా రంజాన్

- ఈద్గాల వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ నల్లరిబ్బన్‌తో నిరసన
- ప్రవక్త సందేశాన్ని వినిపించిన మత పెద్దలు

కోడుమూరు, పాణ్యం నియోజవర్గాల్లో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించారు. నెలరోజుల పాటు నియమ నిష్టలతో కఠిన ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు ఆదివారం సాయంత్రం నెలవంక కనిపించడంతో దీక్ష విరమించారు. సోమవారం ఈద్ ఉల్ ఫితర్ సందర్భంగా ఉదయం నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. ఈద్గాలు, మసీదులు కిటకిటలాడాయి. ఆయా గ్రామాల్లోని ఇమాంమ్‌లు, మత పెద్దలు రంజాన్ పండుగ విశిష్టతను వివరించారు. మహమ్మద్ ప్రవక్త బోధనలను వినిపించారు. సక్రమ మార్గంలో నడుచుకుంటున్న వారికి అల్లా దీవెనలు ఉంటాయని సూచించారు. ప్రార్థనలు అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వక్ఫ్‌బోర్డు చట్టసవరణ బిల్లుకు వ్యతిరేకంగా నల్ల రిబ్బన్ ధరించి ప్రార్థనలకు హాజరయ్యారు.



గూడూరులో నల్లరిబ్బన్‌తో ముస్లింలు

కోడుమూరు రూరల్/సి.బెళగల్/కర్నూలు(రూరల్): కోడుమూరు పట్టణంలోని పత్తికొండ, ఎమ్మిగనూరు రోడ్డువైపు ఉన్న ఈద్గాల వద్దకు చేరుకుని అక్కడ ప్రత్యేక నమాజును నిర్వహించి అల్లాను ప్రార్థించారు. కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్‌బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ గూడూరులో మున్సిపల్ వైస్ చైర్మన్ పీఏస్ అస్లామ్ ఆధ్వర్యంలో ముస్లింలు నల్లరిబ్బన్‌తో నిరసన తెలిపారు. సి.బెళగల్‌లో ఈద్గాలో ఢిల్లీ నుంచి వచ్చిన హఫీసాబ్ జక్రియా రంజాన్ మాసం విశిష్టతను వివరించారు. ప్రార్థనల అనంతరం ఆయా ఈద్గాల వద్ద వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరును ముస్లింలు తప్పు బట్టారు. కర్నూలు మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు గ్రామంలో గ్రామ ముస్లిం పెద్దలు, గ్రామ సర్పంచు బాల పీర, ఎంపీటీసీ మెహ బూబ్ బాషా, అడ్వకేట్ మెహబూబ్ బాషా, మునీర్ బాషా, ముస్లింలు నల్లరిబ్బన్ ధరించి ప్రార్థనలకు హాజరయ్యారు. గార్గేయపురం ఈద్గా వద్ద ముస్లిం మత పెద్ద అహమ్మద్ బాషా రంజాన్ విశిష్టతను వివరించారు. కర్నూలు నగరంలోని సంతోష్ నగర్ వద్ద ఉన్న ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. అల్లా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



కోడుమూరులోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పాణ్యం ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రార్థనలో పాల్గొన్న కర్నూలు ఎంపీ నాగరాజు

కల్లూరు/ఓర్వకల్లు/గడివేముల/పాణ్యం: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఓర్వకల్లులో మత గురువులు మౌలాన ముజీబుర్ రహమాన్ రషీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పవిత్ర ఖురాన్‌లోని సందేశాన్ని వినిపించారు. గడివేములతో పాటు బిలకలగూడూరు, గని, మంచాలకట్ట, బూజునూరు, పెసరవాయి, కరిమద్దెల, కొర్రపోలూరు గ్రామాలలోని ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయం పక్కనున్న ఈద్గాలో ఉదయం 9 గంటలకు రంజాన్ ప్రార్థనలు ప్రారంభమైయ్యాయి. దాదాపుగా గంటలకు పైగా మతపెద్దలు ప్రవక్త సందేశాన్ని వినిపించారు. శాంతిరామ్ ఆసుపత్రి వద్ద ఉన సున్నీ ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలు చేశారు. ఓర్వకల్లులో మత గురువులు మౌలానా ముజీబుర్ రహమాన్ రషీద్ ఆధ్వర్యంలో ముస్లింలు నల్లరిబ్బన్ ధరించి స్థానిక జామియా మసీద్ నుంచి ఈద్గా వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు.



ఓర్వకల్లులో ఖురాన్ సందేశం వినిపిస్తున్న మత గురువులు



గడివేముల ఈద్గాలో రంజాన్ సందేశాన్ని వివరిస్తున్న ఈమామ్

మూల పెద్దమ్మకు బోనాల సమర్పణ

గడివేముల: మండల కేంద్రం గడివేములలో వెలసిన మూలపెద్దమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి సోమవారం భక్తులు బోనాలు సమర్పించారు. కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న మూలపెద్దమ్మ అమ్మవారి జాతర వైభవంగా ప్రారంభమైంది. తెలుగురాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారికి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరించి ఆకుపూజ, కుంకుమార్చన పూజలు నిర్వహిహించి దర్శించుకున్నారు. అంతకు ముందు అమ్మవారికి ఘటానికి వెళ్లారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈఓ రామానుజన్ ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాణ్యం కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీడీపీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డిలు సోమవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఈఓ సన్మానించారు. కార్యక్రమంలో కన్వీనర్ సత్యం రెడ్డి, ఉత్సవకమిటీ సభ్యుడు రమణారెడ్డి, మాజీ సర్పంచ్ జమాల్ బాషా, టీడీపీ సీనియర్ ఎస్ఏ రఫీక్, వడ్డు లక్ష్మీదేవి, సుభద్రమ్మ, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.



మేళతాళలతో బోనాలను తీసుకెళ్తున్న భక్తులు

ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలి

- హిమోఫీలియా వ్యాధిగ్రస్తుడి విన్నపం

జూపాడుబంగ్లా: హిమోఫీలియా వ్యాధిగ్రస్తుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫ్యాక్టర్–7 ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలని హిమోఫిలియా వ్యాధిగ్రస్తుడు థామస్ వేడుకుంటున్నాడు. తండంచ గ్రామానికి చెందిన ధర్మరాజు కుమారుడు థామస్ పదో తరగతి చదువుతున్నాడు. భార్య కొంతకాలం క్రితం మృతిచెండంతో కూలీ పనులకు వెళ్తూ కుమారుడిని చదివించుకుంటున్నాడు. అయితే కుమారుడు థామస్‌కు పుట్టుకతోనే హిమోఫీలియా వ్యాధి ఉంది. ఈ వ్యాధి తీవ్రతను బట్టి ప్రతి నెలా ఫ్యాక్టర్–7, 8, 9 ఇంజెక్షన్లు వేసుకోవాల్సి ఉంది. ఇంజెక్షన్ వేయించుకోకపోతే కీళ్లవద్ద వాపులు వచ్చి అంతర్గతంగా రక్తం బ్లీడింగ్ అయి ఆరోగ్యం క్షీణించి అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంటుంది. సోమవారం థామస్ 'సాక్షి'తో మాట్లాడుతూ ఇంజెక్షన్లు బయట కొనుగోలు చేయాలంటే ఒక్కొక్కటి రూ.4 వేల నుంచి రూ.6 వేలు ఉందన్నారు. ఫ్యాక్టర్–7 ఇంజెక్షన్లు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆస్పత్రుల్లో సరఫరా లేదంటున్నారన్నారు. తన తండ్రి కూలీ పనులకు వెళ్లి తనను పోషిస్తున్నాడని బయట ఇంజెక్షన్లు కొనుగోలు చేసే శక్తి తమకు లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో ఇంజెక్షన్లు, మందులు అందుబాటులో ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచాలని కోరారు.



తండ్రితో హిమోఫిలియా వ్యాధిగ్రస్తుడు థామస్

2 నుంచి రిజిస్ట్రేషన్లు

నంద్యాల(అర్బన్): ఏప్రిల్ 2 నుంచి నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్లాట్ బుకింగ్ ద్వారా సులభతరమైన రిజిస్ట్రేషన్లు జరగనున్నాయని సబ్ రిజిస్ట్రార్–2 చంద్రమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ ఉత్తర్వులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ కర్నూలు వారి ఉత్తర్వుల మేరకు దస్తావేజు స్వీకరణకు ప్రభుత్వం స్లాట్ బుకింగ్‌ను నూతనంగా ప్రవేశపెట్టిందన్నారు. క్యూలైన్‌లో గంటల తరబడి వేచి చూడకుండా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మూడు గడ్డివాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రుద్రవరం: మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నె లో సోమవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన చిన్న సుబ్బరాయుడు, రాములమ్మ, గంతులయ్య అనే ముగ్గురు రైతులకు చెందిన గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. దూమపానం చేసే వారి నిర్లక్ష్యం కారణంగా గడ్డివాములకు నిప్పంటుకున్నట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదంలో బాధిత రైతులకు నష్టం సంభవించడంతో పాటు పశువులకు గ్రాసం కొరత ఏర్పడిందన్నారు.

ముగిసిన శ్రీవల్లెలాంబ ఉత్సవం

కోడుమూరు రూరల్: పట్టణంలో వెలసిన శ్రీ వల్లెలాంబదేవి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు పారువేట, వసంతోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన పొట్టేళ్ల పోటీలు ఎంతో హోరాహోరీగా సాగాయి. పోటీలకు కర్నూలు జిల్లాతో పాటు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన 22 వరకు పొట్టేళ్లు పోటీలో తలపడ్డాయి. ఈ పోటీల్లో తెలంగాణలోని ఐజకు చెందిన సుల్తాన్ పొట్టేలు విజేతగా నిలిచి మొదటి బహుమతిగా రూ.20 వేలను కైవసం చేసుకుంది. అలాగే గుంతకల్‌కు చెందిన మీసల మామ పొట్టేలు 2వ స్థానం, వెంకటాపురం చెందిన రాయన్ గ్రూపు పొట్టేళ్లు 3, 5 స్థానం, ముడుమలగుర్తి లడ్డు పొట్టేలు 4వ స్థానంలో గెలుపొంది వరుసగా, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలను కై వసం చేసుకున్నాయి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



హోరాహోరీగా తలపడుతున్న పొట్టేళ్లు

వైభవంగా శ్రీగిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం





ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో శ్రీగిడ్డాంజనేయస్వామి

కోడుమూరు రూరల్: వెంకటగిరి గ్రామంలో వెలసిన శ్రీగిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం కనులపండువగా సాగింది. సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామస్తులు స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై ఉంచి గ్రామంలోని దస్తగిరయ్య కట్ట వరకు ఊరేగించారు. అనంతరం సాయంత్రం స్వామి వారి పారువేట కార్యక్రమాన్ని గ్రామస్తులు కన్నులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కాంట్రాక్టర్ గోపాల్‌రెడ్డి, తిమ్మారెడ్డి, పాల గిడ్డయ్య, గిడ్డయ్య, వెంకటశివుడు, మద్దిలేటి, గిరిబాబు, నాగేశ్వరరావు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లెకు చెందిన లక్ష్మీదేవి సోమవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మీదేవికి గ్రామానికి చెందిన ఓబులేసుతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం అయ్యింది. ఉమ్మడి కుటుంబంలో నివశిస్తున్న వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే ఇంటి పనుల విషయంలో ఆమెకు, తోడి కోడలికి మధ్య చిన్న వాగ్వివాదం నెలకొంది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

పన్నుల ఆదాయం రూ. 79.23 కోట్లు

కర్నూలు (టౌన్): 2024–2025 ఆర్థిక సంవత్సరం గడువు ముగిసింది. సోమవారం సాయంత్రం నాటికి నగరపాలక సంస్థకు ఆస్తి, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్సులు, ఖాళీ స్థల పన్నుల ద్వారా రూ. 79.23 కోట్ల ఆదాయం సమకూరింది. రంజాన్ పండుగ రోజు కూడా పన్ను కౌంటర్లు పనిచేశాయి. సోమవారం పన్నులు చెల్లించేందుకు చివరి రోజు కావడంతో మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఆఫీసర్ ఇశ్రాయేలు పన్ను కౌంటర్లను పరిశీలించారు. అలాగే సీ.క్యాంపు, బాలాజీ నగర్, కల్లూరు వార్డు కార్యాలయంలో పన్ను వసూళ్లపై ఆరా తీశారు.



గార్దభంపై సవారీ



ఆలయం చుట్టూ బురదలో గార్దభంచే ప్రదక్షిణలు చేస్తున్న యువకులు

భక్తిభావం.. సాంస్కృతిక వైభవం

- చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఘనంగా ఉగాది ఉత్సవాలు
- ఆలయం చుట్టూ బురదలో ఎడ్లు, గార్దభాలలతో ప్రదక్షిణ
- తిలకించి పులకించిన భక్తజనం

కల్లూరు: కల్లూరులో వెలసిన చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఉగాది ఉత్సవాలు రెండవ రోజు కనుల పండువగా జరిగాయి. సోమవారం ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, జ్యోతి సేవ, పంచామృతాభిషేకం, ఉదయం 9 గంటలకు దీపోత్సవ సేవ (జ్యోతుల), బలిహరణ, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మొక్కుబడులు ఉన్న రైతులు తమ ఎడ్లను రంగులు, పూలమాలలతో అలకరించుకుని అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. రజకులు తమ గాడిదల (గార్దభాల) బండ్లను పూలతో, రంగులతో అలంకరించుకుని డప్పులు, మేళతాలాలు, డ్రమ్స్, డీజేలతో ఉత్సాహంగా కేరింతలు కొడుతూ, నృత్యాలు చేస్తూ ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన బురదలో ఎడ్లు, గాడిదలచే ప్రదక్షిణలు చేశారు. చిన్నారులు, యువకులు ఒంటి నిండా బురద పూసుకొని వేడుకలో పాల్గొన్నారు. ఆలయం చుట్టూ ఉన్న బురదలో తిరగడం వల్ల చర్మవ్యాధుల నుంచి అమ్మవారు కాపాడతారని భక్తుల విశ్వాసం. అలాగే వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని భక్తిశ్రద్ధలతో ఎడ్లు, గాడిదలచే ప్రదక్షిణలు చేయించారు. ఎడ్లు, గాడిదల ఊరేగింపును తిలకించేందుకు కర్నూలుతో పాటు చుట్టుపక్కల జిల్లాలు, తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



గార్దభాల బండితో ఊరేగింపుగా వస్తున్న భక్తులు



గార్దభాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఆలయం వద్దకు తీసుకొస్తున్న భక్తులు

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ శాఖకు పనులు జరుగుతున్నందున సోమవారం వివిధ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. యూకాన్ ప్లాజా ఫీడర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. జిల్లా పరిషత్ నుంచి కిడ్స్ వరల్డ్ పార్క్ మధ్యనున్న ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 11 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయన్నారు.